



విద్యార్థులతో విజయ్

నీట్ వద్దు

- వ్యతిరేక తీర్మానానికి సంపూర్ణ మద్దతు
- రాష్ట్ర సిలబస్‌లో చదివిన వారికి ఎన్‌సీఈఆర్‌టీ పరీక్షలా?
- విద్యను మళ్లీ రాష్ట్ర జాబితాలోకి చేర్చాలి
- ఒక దేశం...ఒక సిలబస్...ఒకే పరీక్ష వద్దు
- లీకేజీతో నీట్‌పై సన్నగిల్లిన నమ్మకం
- నిప్పులు చెరిగిన విజయ్
- విద్యార్థుల నగదు బహుమతి పంపిణీ



కార్యక్రమంలో విజయ్ అభివాదం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యా కోర్సులు చదవాలని ఆకాంక్షించే గ్రామీణ విద్యార్థులకు తీరని నష్టం కలిగించే నీట్ రద్దు చేయాల్సిందేనని తమిళగ వెట్రి కళగం నాయకుడు, ప్రముఖ సినీ నటుడు విజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని నీట్ నుంచి మినహాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ డీఎంకే ప్రభుత్వం శాసనసభలో చేసిన తీర్మానానికి తాను సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. స్థానిక తిరువాన్మియూరు లోని రామచంద్రా కన్వెన్షన్ కల్యాణమండపంలో బుధ వారం ఉదయం రెండో విడతగా 19 జిల్లాలకు చెందిన 107 శాసనసభ నియోజకవర్గాల్లోని పదో తరగతి, ప్లస్-2 పరీక్షలలో ఉత్తీర్ణులైన 640 మంది విద్యార్థులకు నగదు కానుకలు, విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ మాట్లాడుతూ... రెండు రోజులపాటు విద్యార్థులకు నగదు కానుకలు పంపిణీ చేయడంతో అలసిపోయిన తాను ప్రసంగించకూడదనే అనుకున్నానని, అయితే దేశవ్యాప్తంగా కీలకమైన అంశం వివాదాస్పదంగా మారుతుండటంతో దానిపై మౌనం పాటించడం సమంజసం కాదని భావించానన్నారు. ఆ విషయం ఏమిటో సభకు హాజరైన విద్యార్థులందరికీ తెలిసిందే నని, అదే విద్యార్థి లోకానికి తీరని నష్టాన్ని కలిగిస్తున్న నీట్ పరీక్ష అని అన్నారు. నీట్ వల్ల రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకించి మారుమూల గ్రామాల్లోని నిరు పేద విద్యార్థులు, బీసీ, ఎస్సీఎస్టీ విద్యార్థులంతా తీవ్రంగా నష్టపోతున్నారని, వైద్యకోర్సులకు దూరమవుతున్నారన్నదే నూటికి నూరుపాళ్లు నిజమన్నారు. ఈ నీట్‌పై తాను మూడు కోణాల్లో విశ్లేషిస్తానని చెప్పారు. నీట్ రాష్ట్ర హక్కు లకు వ్యతిరేకమైనదని, 1975కు ముందు విద్య రాష్ట్రాల జాబితాలో ఉండేదని, కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జాబితాలో చేర్చిందని, అప్పటి నుంచే సమస్య ప్రారంభమైందన్నారు. ఒక దేశం, ఒక సిలబస్, ఒకే పరీక్ష అనే సిద్ధాంతంలో విద్యనభ్యసించాలనే ఆశయానికే వ్యతిరేకమైనదన్నారు. ఒక్కో రాష్ట్రానికి తగినట్లు వేర్వేరు సిలబస్‌లు అమలులో ఉండటమే శ్రేయస్కరమన్నారు. రాష్ట్ర హక్కుల కోసమే తానీ ప్రకటన చేయడం లేదని, విద్యా విధానంలో విప్లవా త్మక మార్పులు రావాలని, విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్నదే తన ఆశయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం లేదా బహుముఖత్వాన్ని దేశానికి బలంగా భావించాలే తప్ప బలహీనంగా భావించకూడదన్నారు. ప్రాంతీయ భాషలో రాష్ట్ర సిలబస్ ద్వారా చదివే విద్యార్థులకు ఎన్‌సీ ఈఆర్‌టి సిలబస్‌లో పరీక్షలు జరుపటం అన్యాయమ న్నారు. అందులోనూ రాష్ట్రంలో ప్లస్-2 వరకు రాష్ట్ర సిలబ స్‌లో చదివిన కుగ్రామాల విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ సిల బస్‌లో తయారైన నీట్ పరీక్ష సులువుగా ఎలా రాస్తారని విజయ్ ప్రశ్నించారు. ఇటీవల నీట్ పరీక్షలో ప్రశ్నపత్రాల లీకేజీ, అవినీతి అక్రమాలు జరగడంతో ఆ పరీక్షపై ఇంతవ రకూ ఉన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లిందన్నారు. నీట్ లీకేజీ తర్వాత దేశమంతటా నీట్ అనవసరమనే భావనలే ఏర్పడుతున్నాయన్నారు. వీటన్నింటికీ పరిష్కారమార్గంగా రాష్ట్ర ప్రభుత్వం నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని శాసనసభలో చేసిన తీర్మానానికి విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నీట్ మినహాయింపును కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటిస్తుందని తాను భావించడం లేదని, రాష్ట్ర ప్రజల ఆశయాన్ని గుర్తించి వీలైనంత త్వరగా నీట్ రద్దు చేయడమే మంచిదని చెప్పారు. విద్యను గతంలా రాష్ట్ర జాబితాలో చేర్చితే ఆయా రాష్ట్రాల సిల బస్‌లో చదివిన విద్యార్థులకు, ఆ సిలబ స్‌లోని అంశాలతో నిర్వహించే పోటీ పరీక్షలు సులువుగా రాయగలుగుతారని విజయ్ అన్నారు. విద్య ఉమ్మడి జాబి తాలో ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే అంశాలను బుట్టదాఖలు చేయడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవా యితీగా మారిందని విజయ్ ఆరోపిం చారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపుతున్న ఎయిమ్స్, జిప్మర్ తదితర విద్యా సంస్థల్లో నీట్ జరుపుకుంటే తనకెలాంటి అభ్యంతరం లేదని కూడా విజయ్ స్పష్టం చేశారు.

టీఎన్‌సీసీ మద్దతు...

నీట్ పరీక్షలకు వ్యతిరేకతను ప్రకటించిన తమిళగ వెట్రి కళగం నాయ కుడు విజయ్‌పి అభినందిస్తున్నట్లు టీఎన్‌సీసీ అధ్యక్షులు సెల్వపెరుంతగై అన్నారు. ఈ మేరకు ఎక్స్ పేజీలో ఆయన ఓ ప్రకటన వెల్లడించారు. విద్యా ర్థులకు నగదు కానుకల పంపిణీ సభలోనీట్‌పై తనకున్న అభిప్రాయాన్ని విజయ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం అభినందనీయమన్నారు. తమిళ ప్రజల చిరకాలపు కోరికగా ఉన్న నీట్ పరీక్షల రద్దు త్వరలోనే అమలులోకి రాగలదని విజయ్ ప్రసంగం తనకు నమ్మకాన్ని కలిగిస్తోందన్నారు.



ధర్నాలో పాల్గొన్న డీఎంకే నేతలు

రద్దు చేయాల్సిందే

డీఎంకే డిమాండ్ ● చెన్నైలో ధర్నా

అడయార్, జూలై 3: దేశంలో వైద్య విద్యా కోర్సుల్లో చేరేం దుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్ రద్దు చేయాల్సిందే నని డీఎంకే డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో ఆ పార్టీ బుధ వారం నుంగంబాక్కంలోని వల్లువర్‌కోట్టం వద్ద ధర్నా చేసింది. డీఎంకే విద్యార్థి విభాగానికి చెందిన ఎంపీ ఎళిలరసన్ సారథ్యం వహించారు. 'విద్యను పరిరక్షిద్దాం - బీజేపీని నిర్మూ లిద్దాం', 'రద్దు చేయాలి రద్దు చేయాలి .. నీట్ రద్దు చేయాలి' అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన తీర్మానం మేరకు నీట్ రద్దు చేయాలని, లేదా ఈ ప్రవేశ పరీక్షల నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న ఆ పార్టీ ఆర్గ నైజింగ్ కార్యదర్శి ఆర్ఎస్.భారతి మాట్లాడుతూ... ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో నీట్ ప్రవేశ పరీక్షా విధానంపై చర్చకు విపక్ష పార్టీలు కోరగా, సభాపతి తొలుత అంగీకరించారన్నారు. కానీ, ఈ అంశంపై చర్చ జరిగితే సభకు సమాధానం చెప్పాల్సి వస్తుందన్న భయంతో ప్రధాని నరేంద్ర మోదీ.. ఈ అంశంపై మాట్లాడేందుకు ఏమీలేదని వ్యాఖ్యానిం చడంతో సభను మంగళవారమే నిరవధికంగా వాయిదా వేశా రని చెప్పారు. ఒక విధంగా ఇది డీఎంకేకు లభించిన విజయ మన్నారు. దేశంలో నీట్ ప్రవేశ పరీక్ష ప్రవేశపెట్టినప్పటి నుంచి ఈ విధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఏకైక రాజకీయ పార్టీ డీఎంకే అని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కలైం జర్ ఉన్న సమయంలో నీట్‌ను రాష్ట్రంలోకి అనుమతించలేద న్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే, ముఖ్య మంత్రిగా ఉన్న ఎడప్పాడి పళనిస్వామి ఈ పరీక్షను రాష్ట్రం లోకి అనుమతించారన్నారు. ఇపుడు ఈ సమస్య మరింత జటి లంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, ఈ ధర్నా కార్యక్రమంలో అనేక మంది డీఎంకే సీనియర్ నేతలు, కార్యక ర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డికి

ఊరట

మూడేళ్ల జైలు శిక్ష రద్దు ● హైకోర్టు తీర్పు



బాలకృష్ణారెడ్డి

పెరంబూర్, జూలై 3: ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలి గించేలా అల్లర్లకు పాల్పడ్డారనే నేరారోపణలను ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డికి ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఆయనకు ప్రత్యేక కోర్టు విధిం చిన మూడేళ్ల జైలు శిక్షను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ప్రత్యేక కోర్టు జైలు శిక్ష విధించ డంతో అప్పట్లో క్రీడాశాఖ మంత్రిగా పనిచేసిన బాలకృష్ణా రెడ్డి మంత్రి పదవితో పాటు శాసనసభ్యత్వాన్ని సైతం కోల్పోయిన విషయం తెలిసిందే. 1998 సంవత్సరం హోసూరు సమీపంలోని బాగ లూరులో అన్నాడీఎంకే నిర్వహించిన ఆందోళన సందర్భంగా జరిగిన బస్సులపై రాళ్ల దాడి సంఘటనకు సంబంధించి బాలకృష్ణారెడ్డి సహా 108 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎంపీలు, ఎమ్మెల్యేల నేరాలపై విచారణ జరిపే ప్రత్యేకకోర్టు విచారణ జరిపింది. బాలకృష్ణారెడ్డి సహా 16 మందిని దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో బాలకృష్ణారెడ్డికి మూడేళ్ల జైలు విధిస్తూ ప్రత్యేక కోర్టు 2019 జనవరి 7న తీర్పునిచ్చింది. జైలు శిక్షపడటంతో బాలకృష్ణారెడ్డి మంత్రి పదవితో పాటు శాసనసభ్యత్వాన్ని ఒకేసారి కోల్పోయారు. ఆ నేపథ్యంలో ప్రత్యేక కోర్టు విధించిన తీర్పును సవాలు చేస్తూ బాలకృష్ణారెడ్డి సహా 16 మంది హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ జయచంద్రన్ విచారణ జరిపారు. ప్రభుత్వ తరపు, పిటి షనర్ల తరపు వాద ప్రతివాదనలు ముగియటంతో న్యాయమూర్తి బుధ వారం తీర్పు వెలువరించారు. బాగలూరులో జరిగిన అల్లర్లకు సంబం ధించి పోలీసుల విచారణ లోపభూయిష్టంగా వుందని, నిజానికి ఆందోళ నలో పాల్గొన్నవారిని సక్రమంగా గుర్తించలేకపోయారన్నారు. ఈ కేసులో పోలీసుల తరపు వాదనలన్నీ చాలా బలహీనమైనవిగానే ఉన్నా యని, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని బాలకృష్ణారెడ్డికి ప్రత్యేక కోర్టు విధించిన జైలు శిక్షను రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి జయచంద్రన్ పేర్కొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి పరందూర్ ఉద్యమ కమిటీ యత్నం

● ఆందోళనకారుల అరెస్టు



ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ప్యారీస్, జూలై 3: కాంచీపురం జిల్లా పరందూర్ హరిత విమానా శ్రయానికి వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయ ముట్టడికి యత్నించిన ఉద్యమ కమిటీ నిర్వాహకులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పరందూర్ సమీపంలోని 13 గ్రామాలకు చెందిన భూము ల్లో రెండవ హరిత విమానా శ్రయం ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్రప్ర భుత్వాలు ప్రణాళిక రూపొందిం చాయి. ఈ విమానాశ్రయానికి ప్రారంభం నుంచే గ్రామస్తులు వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్ర మాలు కొనసాగిస్తున్నారు. ఏకనాపురం గ్రామస్తులు తమ నిరసన వ్యక్తం చేస్తూ 709 రోజు లుగా రేయింబవళ్లూ పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రెండు రోజుల క్రితం కాంచీపురం జిల్లా వ్యాప్తంగా కలైంజర్ గ్రామ సభలు జరిగాయి. అయితే ఏకనాపురం గ్రామంలో మాత్రం గ్రామసభ నిర్వహించకపోవడాన్ని ఖండిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు రిలే నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు పరందూర్ విమానాశ్రయ వ్యతిరేక ఉద్యమ కమిటీ నిర్వాహకులు ప్రకటించారు. ఆ మేరకు బుధవారం ఉదయం 9 గంటలకు ఏకనాపురం గ్రామంలోని డా.అంబేడ్కర్ విగ్రహం ముందు గుమిగూడిన ప్రజలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వైఖరి ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం సుమారు వంద మందికి పైగా అక్కడి నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడికి బయల్దేరగా, వారిని అడ్డుకున్న పోలీ సులు సుంకువారిసత్రంలో ఉన్న ఓ కల్యాణ మండపానికి తరలించారు.

తమిళనాడు అంటే ఎంతో అభిమానం

కేంద్రమంత్రి సురేష్ గోపి

పెరంబూర్, జూలై 3: తాను తమిళనాడు ఎంపీ నని కేంద్ర మంత్రి, నటుడు సురేష్ గోపి తెలిపారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటిసారిగా చెన్నై వచ్చారు. విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేరళ ఎన్నికలకు ముందే తాను తమి ళనాడు ప్రతినిధిగా వ్యవహరించానన్నారు. తనకు ఇష్టమైన శాఖ పర్యాటక శాఖ అని, కానీ తనకు పెట్రోలియం శాఖ దక్కిందన్నారు. శబరిమలై అంశాన్ని లేవనెత్తిన వారు ప్రస్తుతం కనిపించకుండా పోయారన్నారు. తనకు నటించే అవకాశం, ఆశ్రయం కల్పించింది చెన్నై అని, తమిళనాడు అంటే ఎంతో అభిమానమని కేంద్ర మంత్రి తెలిపారు. అలాగే, నీట్ గురించి విలే ఖరులు అడిగిన ప్రశ్నకు రాజకీయాలపై మాట్లాడవద్దంటూ సూచించారు.

ఇంగ్లీషులోనే కొత్త క్రిమినల్ చట్టాలు

● హైకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

ప్యారీస్, జూలై 3: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని న్యాయవాదులు ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతున్నారు. కొత్త క్రిమి నల్ చట్టాలకు వ్యతిరేకంగా తూత్తుకుడికి చెందిన రామ్‌కుమార్ ఆదిత్యన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో వివరాలిలాఉన్నాయి... దేశంలో 150 యేళ్ల క్రితం బ్రిటీష్ పాలకులు రూపొందించిన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండి యన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872చట్టాలు అమల్లో ఉన్నాయి. వీటి స్థానంలో కేంద్రం మూడు కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకువచ్చింది. ఐపీసీ చట్టం స్థానంలో భారతీయ న్యాయ సన్హిత 2023, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సన్హిత, ఐఈఏ స్థానంలో భారతీయ సాక్ష్య పేరుతో ఈ చట్టాలను రూపొందించింది. ఈ చట్టాలు కూడా హిందీ, సంస్కృత భాషల్లో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగానికి విరుద్ధమని ప్రకటిం చాల్సిందిగా పిటిషనర్ కోరారు. ఈ కేసు బుధవారం మద్రాసు హైకోర్టు ఇన్ చార్జి న్యాయమూర్తి మహాదేవన్, న్యాయమూర్తి మహమ్మద్ సబిక్‌లతో కూడిన ప్రథమ ధర్మాసనం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అడిషి నల్ సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేశన్...ఆమూడు చట్టాలు ఆంగ్లంలోనే పార్లమెంటులో కొత్త క్రిమినల్ చట్టాలు నెరవేర్చినట్లు వివరించారు. పార్లమెం టులో ఆమోదించే బిల్లులను న్యాయస్థానం జోక్యం చేసుకోలేదని వాదించారు. అనంతరం ఈ వ్యవహారంపై ఈ నెల 23వ తేదిలోపు అఫిడవిట్ దాఖలుచే యాలని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది.

6 నుంచి విక్రవాండిలో ఉదయనిధి ప్రచారం

పెరంబూర్, జూలై 3: విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పీఎంకే అభ్యర్థికి మద్దతుగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డా.అన్బుమణి రాందాస్ ఇంటింటా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ నేప థ్యంలో, ఉప ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా యువజన సంక్షేమం, క్రీడా భివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి ఈ నెల 6,7,8 తేదీల్లో నియోజకవర్గంలో ప్రచారం చేపట్టనున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొనే అవకాశం లేదని పార్టీ వర్గాల సమాచారం.

కొత్త బంగారులోకం...

ప్రభుత్వ కళాశాలల్లో

సందడి

- మొదటి రోజు కాలేజీలకు వచ్చిన ఫస్టియర్ విద్యార్థులు
- మేళతాళాలతో స్వాగతం పలికిన సీనియర్లు



పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ విద్యార్థుల ప్రతిజ్ఞ



విద్యార్థులకు మేళతాళాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్యారీస్, జూలై 3: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు మేళ తాళాలతో విద్యార్థి సంఘ నాయకులు బుధవారం ఘనంగా స్వాగతించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు చాక్లెట్లు, గులాబీలు అందజేసి, తిలకం దిద్ది ఆహ్వానించారు. పలు కళాశాలల్లో ప్రార్థనా కార్యక్ర మంలో పాల్గొన్న విద్యార్థులకు సీనియర్ ప్రొఫెసర్లు, ఈ విద్యా సంవత్సరంలో ఎలా చదువుకోవాలి, అధ్యా పకులు, సహ విద్యార్థులతో ఎలా మెలగాలి అన్న దానిపై సూచనలిచ్చారు. ట్రిప్లికేన్ నియోజకవర్గం మెరీనా బీచ్ సమీపంలోని రాజధాని కళాశాలలో తొలిరోజు కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేలా సీనియర్లు కార్యక్రమాలు నిర్వ హించారు. కళాశాల ప్రధాన ప్రవేశద్వారంలో ఎర్ర తివాచి పరచి, నాదస్వరం, సన్నాయి మేళాలతో విద్యార్థులను ఆహ్వానించారు. కళాశాల ఫొటోతో ముద్రించిన క్యాలెండర్లను విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు అందించి అల్పాహారాన్ని కూడా వడ్డిం చారు. డిగ్రీ ఫస్టియర్ విద్యార్థుల ఆహ్వాన కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్మేగం పాల్గొని, క్రమశిక్షణతో చదువుకుంటే భవి ష్యత్తు ప్రకాశవంతంగా ఉంటుందని, ఒక విద్యా సంవత్సరంలో విద్యార్థుల అటెండెన్స్ ముఖ్యమని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో బుధవారం తరగతులు ప్రారంభమయ్యాయని, వారం రోజులు విద్యార్థులకు పుస్తక పఠనంపై ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించను న్నట్లు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ఆయా జిల్లా కలెక్టర్లు, ఉన్నత పోలీసు అధికారులు, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ప్రముఖులను ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమాలు విద్యార్థుల కోసం నిర్వహించ నున్నట్లు కార్మేగం తెలిపారు. మరోవైపు రాయపేట లోని న్యూ కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులు కళా శాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీని యర్‌లతో కలసి వివిధ కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు.

సమాచార దర్శిని

72 పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 3: తమిళ భాష, సంస్కృతికి కృషి చేసిన వారికి రాష్ట్రప్రభుత్వం పురస్కారాలు అందజేస్తోంది. వచ్చే ఏడాదికి సంబంధించి తిరువళ్లువర్ అవార్డు, ఈ సంవత్సరానికి సంబంధించి మహాకవి భారతీయార్, పారివేందర్ వంటి 72 పురస్కారాలకు అర్హులైన వారు ఆగస్టు 15వ తేదిలోగా www.tamilvalarchithurai.tn.gov.in/awards, http://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చు.

జానపద కళలపై శిక్షణ

ఐసిఎఫ్, జూలై 3: జానపద కళలపై శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. చెన్నై, మదురై, కోయంబత్తూర్ సహా వివిధ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ సంగీత పాఠశాలలు, తంజావూరు మండల కళలు, సంస్కృతి కేంద్రంలో గరగం, సిలంబాట్టం, గుమ్మి, తురుంబాట్టం వంటి వివిధ రకాల జానపద కళలపై ఏడాది పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 12వ తేది నుంచి శుక్ర, శనివారాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఇవ్వనున్న శిక్షణలో 17 ఏళ్లకు పైబడి 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు www.artandculture.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

7న జగన్నాథ రథయాత్ర

ఐసిఎఫ్, జూలై 3: స్థానిక ఈసీఆర్‌లో ఈ నెల 7వ తేది జగన్నాథ రథయాత్ర ఇస్కాన్ ఆధ్వర్యంలో జరుగనుంది. ప్రతి సంవత్సరం నగరంలో ఈ యాత్ర నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 44వ జగన్నాథ రథయాత్ర 7వ తేది మధ్యాహ్నం 2 గంటలకు ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న పాలవాక్కం నుంచి బయల్దేరి నీలాంగరై, వెట్టువాంగేణి, ఇంజంబాక్కం, అక్కరై మీదుగా సాయంత్రం 6 గంటలకు ఇస్కాన్ ఆలయానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భక్తి వినోదస్వామి మహరాజ్ పాల్గొననున్నారు.

గ్రూప్-1 పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదల

పెరంబూర్, జూలై 3: టీఎన్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదల చేసింది. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్ష నోటిఫికేషన్ మార్చి 28వ తేది విడుదల చేసింది. ఆ ప్రకారం, ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 13వ తేది జరుగనున్న నేపథ్యంలో, పరీక్షకు సంబంధించి హాల్‌టిక్కెట్లు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఈ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని అధికారులు తెలిపారు.

15లోపు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయండి

ఐసిఎఫ్, జూలై 3: ఇంజనీరింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 15వ తేదిలోపు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సరైన వివరాలతో పాటు సర్టిఫికెట్లు సక్రమంగా అప్‌లోడ్ చేయలేదు. దీంతో వారు ఈ నెల 15వ తేది వారికిచ్చిన గడువు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రాచీన భవనాల మ్యాప్‌ల డిజిటలైజేషన్

ఐసిఎఫ్, జూలై 3: డీటీసీపీలో 92,422 ప్రాచీన భవనాల మ్యాప్‌ల డిజిటలైజేషన్ జరుగుతోంది. సీఎండీఏలో 1989 నుంచి 2000 సంవత్సరం వరకు భవనాల మ్యాప్‌లను ఇదివరకే డిజిటల్ విధానంలోకి మార్చారు. ఇదే విధంగా డీటీసీపీలో ప్రభుత్వ ఆమోదం పొందిన భవనాల మ్యాప్‌లను డిజిటలైజేషన్ చేయనున్నారు. దీనికోసం ప్రభుత్వం రూ.20.23 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం 92,422 మ్యాప్‌లను స్కాన్ చేసి డిజిటల్ విధానంలోకి మారుస్తున్నారని అధికారులు తెలిపారు.

ఓమందూర్ ఆస్పత్రి డైరెక్టర్‌గా డా.మణి

ఐసిఎఫ్, జూలై 3: స్థానిక ఓమందూర్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్‌గా డాక్టర్ ఆర్.మణి నియమితులయ్యారు. రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్‌గా ఉన్న విమల పదవీవిరమణ అనంతరం ఒప్పంద పద్ధతిలో ఈ ఆసుపత్రి డైరెక్టర్‌గా 2019లో నియమితులయ్యారు. ఒప్పందకాలం జూన్‌తో ముగియడంతో ఆ స్థానంలో పుదుకోట ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి డీన్ ఆర్.మణిని నియమించారు.

పంట బీమాకు 31 వరకు గడువు

ఐసిఎఫ్, జూలై 3: రైతులు 26 రకాల పంటలకు బీమా చేసేందుకు ఈ నెల 31వ తేది ఆఖరి గడువు అని అధికారులు తెలిపారు. ఈ ఏడాది కురువై సీజన్‌లో వరి, మొక్కజొన్న, కంది, పెసర వంటి 14 రకాల పంటలు, అరటి, ఉల్లి, బంగాళాదుంపలు వంటి 12 ఉద్యానవన పంటలకు జూన్ 21 నుంచి బీమా నమోదు జరుగుతోంది. ఈ నెల 31వ తేది వరకు రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

మెట్రో రైల్వేస్టేషన్లలో దివ్యాంగులకు సౌకర్యాలు

ఐసిఎఫ్, జూలై3:రెండో విడతగా నిర్మిస్తున్న మెట్రో రైల్వేస్టేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. మెట్రో రైల్వేస్టేషన్లలో దివ్యాంగులు వచ్చి వెళ్లేందుకు సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రాలు అందడంతో, దీనిపై స్పందించిన సీఎంఆర్ఎల్ అధికారులు, వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

పాత కుట్రాలంలో రాత్రి వరకు స్నానాలకు అనుమతి

పెరంబూర్, జూలై 3: తెన్‌కాశి జిల్లా పాత కుట్రాలం జలపాతంలో ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులు స్నానాలు చేసేందుకు అనుమతించారు. అంతకు ముందు ఉదయం 6 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకే జలపాతం వద్ద స్నానాలకు అనుమతించేవారు. పర్యాటకుల అభ్యర్థన మేరకు పాత కుట్రాలం జలపాతంలో స్నానాల సమయాన్ని రాత్రి 8గంటలవరకు పొడిగతించారు. అలాగే, మెయిన్ గేటు వరకు ఆటోలు అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటన విడుదల చేసింది.

11న పాత వాహనాల వేలం

ఐసిఎఫ్, జూలై 3: ఈ నెల 11వ తేది పాత వాహనాలను వేలం వేయనున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. చెన్నై ఇంటెలిజెన్స్ విభాగంలో 27 పాత వాహనాలను విక్రయించనున్నారు. 11వ తేది ఉదయం 11.30 గంటలకు మైలాపూర్ ఇంటెలిజెన్స్ కార్యాలయ ప్రాంగణంలో జరిగే వేలంలో పాల్గొనే వారు ఉదయం 10 నుంచి 11.15 గంటల్లోపు రూ.1,000 డిపాజిట్ చెల్లించి పేరు నమోదుచేసుకోవాలని అధికారులు తెలిపారు. వాహనాన్ని వేలంలో పొందిన అనంతరం మిగిలిన పైకం, జీఎస్‌టీతో కలిపి చెల్లించాలన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ జీఎస్‌టీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు వంటి వాటితో హాజరుకావాలని సూచించారు.

కండలేరు డ్యాంలో తగ్గిన నీటిమట్టం

● ఈ నెలలో కృష్ణా జలాల విడుదల ప్రశ్నార్థకం...?

పెరంబూర్, జూలై 3: ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాంలో నీటిమట్టం తక్కువగా ఉండడంతో నగర తాగునీటి అవరాలకు ఈ నెలలో అందించాల్సిన తొలివిడత కృష్ణా జలాల విడుదల చేసే అవకాశం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. రాజధాని నగరం చెన్నై ప్రజల తాగునీటి అవసర్థారం 15 టీఎంసీలు (ఒక టీఎంసీ అంటే 10 వేల మిలియన్ ఘనపుటడుగులు) కృష్ణా జలాలు అందించేలా తమిళనాడు-ఆంధ్ర రాష్ట్రాల మధ్య 1983 ఏప్రిల్ 18న ఒప్పందం జరిగింది. ఆ ప్రకారం, కృష్ణా కాలువ ద్వారా నీరు ప్రవహించే సమయంలో 3 టీఎంసీల నీరు ఆవిరవుతోంది. అందువల్ల 12 టీఎంసీలు మాత్రమే ఆంధ్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి ఏడాది తొలివిడతగా జూలై నుంచి అక్టోబరు వరకు నాలుగు నెలల కాలంలో 8 టీఎంసీలు, రెండో విడతలో జనవరి నుంచి ఏప్రిల్ వరకు నాలుగు నెలల కాలంలో 4 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం అనంతరం మొట్టమొదటి సారిగా 1996లో కృష్ణా జలాలు కృష్ణా కాలువ ద్వారా తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం తామరైపాక్కం జీరో పాయింట్‌కు చేరాయి. పూండి జలాశయానికి చేరుకొనే కృష్ణా జలాలను అక్కడి నుంచి చెంబరంబాక్కం, చోళవరం, పుళల్ జలాశయాలకు పంపించి, నగర తాగునీటి అవసరాలకు పైపుల ద్వారా తరలిస్తుంటారు. 1996 నుంచి ఇప్పటివరకు 112.258 టీఎంసీలు, గత ఏడాది 2.412 టీఎంసీల కృష్ణా జలాలు వచ్చి చేరాయి. ప్రస్తుతం నగరానికి తాగునీరు అందించే జలాశయాల్లో ఉన్న నీటిమట్టాలను పరిశీలించిన అధికారులు, తాగునీటి కోసం కృష్ణా జలాలు అందించాలని రాష్ట్రప్రభుత్వం ఆంధ్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ విషయమై రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్రం శ్రీశైలం నుంచి సోమశిల డ్యాంకు, అక్కడి నుంచి కండలేరు డ్యాంకు కృష్ణా జలాలు చేరుకుంటాయన్నారు. కండలేరు నుంచి రాష్ట్రానికి నీరు విడుదల చేస్తారని తెలిపారు. కండలేరు డ్యాంలో 9 టీఎంసీలకు పైగా నీటిమట్టాలు ఉంటే మాత్రమే, ఆ నీటిని కృష్ణా కాలువలోకి పంపింగ్ చేసే అవకాశముందన్నారు. 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన కండలేరు డ్యాంలో ప్రస్తుతం 8.42 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. అందువల్ల, నగర తాగునీటి కోసం తొలివిడత కృష్ణా జలాలు ఈ నెలలో విడుదల చేసే అవకాశం లేదని అధికారులు తెలిపారు.



కండలేరు డ్యాం

ఎగ్మూర్-నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక వందే భారత్ రైలు

పెరంబూర్, జూలై 3: ఎగ్మూర్-నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక వందే భారత్ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06067 ఎగ్మూర్-నాగర్‌కోయిల్ వందే భారత్ స్పెషల్ ఈ నెల 11,12,13,14,18,19,20,21 (గురు, శుక్ర, శని, ఆదివారాలు)తేదీల్లో ఉదయం 5 గంటలకు చెన్నై ఎగ్మూర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1.50 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. ● నెం.06068 నాగర్‌కోయిల్- ఎగ్మూర్ వందే భారత్ స్పెషల్ ఈ నెల 11,12,13,14,18,19,20,21 తేదీల్లో మధ్యాహ్నం 2.20 గంటలకు నాగర్‌కోయిల్‌లో బయల్దేరి రాత్రి 11 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు... : ● నెం.05952 న్యూ టిన్‌సుకియ- బెంగళూరు వారాంతపు ప్రత్యేక రైలు (పెరంబూర్, కాట్పాడి, జోలార్‌పేట మీదుగా) ఈ నెల 4 నుంచి అక్టోబరు 31వ తేది వరకు (గురువారం) పొడిగించారు. మరు మార్గంలో నెం.05951 బెంగళూరు వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 8 నుంచి నవంబరు 4వ తేది (సోమవారం) పొడిగించారు.

నీట్‌తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లబ్ధి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, జూలై 3: నీట్‌తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు లబ్ధిపొందుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి... నీట్ రద్దు పేరుతో నాటకమాడిన డీఎంకే, అధికారం చేపట్టిన తర్వాత మాజీ హైకోర్టు న్యాయమూర్తి ఏకే రాజన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుచేసిందన్నారు. ఈ కమిటీ రాష్ట్రప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్న లోపాలను గతంలో బీజేపీ పేర్కొందని గుర్తు చేశారు. నీట్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్యకళాశాలల్లో చేరుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వివరాలను పలుమార్లు తాము ప్రకటించినా, ఈ వ్యవహారంలో కమిటీ ఏర్పాటు ఎందుకని ప్రశ్నించారు. ఈ కమిటీ అందజేసిన పొంతనలేని అంశాలు పట్టుకొని నీట్ పరీక్షపై మరోసారి డీఎంకే ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని అన్నామలై విమర్శించారు.

మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ కేంద్రాలుగా జైళ్లు!

● ఈపీఎస్ ఆరోపణ

చెన్నై,జూలై3(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చాక సెంట్రల్ జైళ్లన్నీ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ కేంద్రాలుగా మారాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. ఈమేరకు ఆయన విడుదలచేసిన ఓ ప్రకటనలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటినుండే రాష్ట్రంలో నిషేధితపొగాకు ఉత్పత్తులు గంజాయి అమ్మకాలు జోరు గా సాగుతున్నాయని విమర్శించారు.మాదక ద్రవ్యాల అక్రమరవాణా కేసుల్లో అరెస్టయి జైళ్లలో ఉన్న ఖైదీలు ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా గంజాయి తదితర మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారంటూ వెలువడుతున్న వార్తలు యావత్ ప్రజానీకానికి దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని తెలిపారు. పుళల్‌సెంట్రల్ జైలులో ఉన్న కాశిలింగం అనే ఖైదీ రెడ్‌హిల్స్‌ని ఓ షాపింగ్ మాల్ కేంద్రంగా చేసుకుని ఆన్‌లైన్‌లో తన భార్య సహకారంతో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు సమాచారం వెల్లడైందన్నారు. జైలులో ఉంటూనే ఆన్‌లైన్ ద్వారా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఖైదీపైగానీ, అతడి భార్యపైగానీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిచ్చేలాఉందని ఈపీఎస్ విమర్శించారు.

రౌడీ రాజా దారుణహత్య



రాజా (ఫైల్‌ఫొటో)

వేలూరు, జూలై 3: పలు హత్యానేరాల్లో నిందితుడైన రాజా బుధవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. అరియూర్‌కు చెందిన పోకిరి రాజ్‌కుమార్ అలియాస్ రాజా బుధవారం ద్విచక్రవాహనంలో అరియూర్ ప్రాంతంలో వస్తుండగా, అతడి వెనుకగా కారులో వచ్చిన ముఠా మారణాయుధాలతో దాడి చేసింది. ఈ ఘటనలో రాజా అక్కడిక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్పీ మణివన్నన్ పరిశీలించారు. ఈ ఘటనపై అరియూర్ పోలీసులు కేసు నమోదుచేసి నిందితుల కోసం గాలించారు. ఈ క్రమంలో, కనియంబాడి సమీపం వల్లమ్ ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్టులో వేలూరు తాలూకా ఇన్‌స్పెక్టర్ శుభ నేతృత్వంలో వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటువైపు వస్తున్న కారును అడ్డుకొని తనిఖీ చేయగా, అందులో పెద్ద సంఖ్యలో మారణాయుధాలను గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి అరియూర్‌కు చెందిన దేవరాజ్, అజిత్‌కుమార్, రాజేష్, బాబు, కార్తికేయన్, గణేష్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్దిరోజుల క్రితం రాజాకు నిందితులకు మధ్య వివాదం చెలరేగినట్లు, ఆ సమయంలో మిమ్మల్ని హతమారుస్తానని రాజా బెదిరించినట్లు తెలిసింది. ఆ క్రమంలోనే రాజాను నిందితులు హతమార్చినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. కాగా, హతుడు రాజాపై పలు పోలీస్‌స్టేషన్‌లలో 100కు పైగా కేసులుండగా, వాటిలో 20 హత్యాకేసులుండడం గమనార్హం.

త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటన: శశికళ

పెరంబూర్, జూలై 3: అన్నాడీఎంకేను ఏకతాటిపై నిలిపే పనులు 90 శాతం పూర్తయ్యాయని, మరో పది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నట్లు వీకే శశికళ తెలిపారు. నగరంలో బుధవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ... జయలలిత అధికారంలో ఉన్నప్పుడు, ఒక మహిళ ముఖ్యమంత్రా అంటూ పలు రాజకీయ పార్టీలు విమర్శించాయన్నారు. ప్రస్తుతం జయలలిత చిత్రపటం పలు పార్టీలకు అవసరమవుతోందని అన్నారు. అందుకు ఆమె రాష్ట్ర ప్రజలు, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషి కారణమన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్త పర్యటన ఎందుకు చేపట్టానో మీకే అర్థమవుతుందన్నారు. కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి 65 మంది మృతిచెందడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు.

కుమరి నుంచి కాట్పాడి మీదుగా చెన్నైకు రైలు నడపాలి

● కాంగ్రెస్ ఎంపీ విజయ్‌వసంత్

ప్యారీస్, జూలై 3: కన్నియాకుమారి నుంచి కాట్పాడి మీదుగా చెన్నైకు డైలీ ట్రైన్ నడపాలని కాంగ్రెస్ ఎంపీ విజయ్ వసంత్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో 377 ఆర్టికల్ కింద ప్రాధాన్యత సంతరించుకున్న అంశమైన రైల్వే శాఖకు సంబంధించి జరిగిన చర్చలో ఆయన పాల్గొని, తమిళనాడుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రైల్వే పథకాలు, అమలుపరచాల్సిన కొత్త పథకాలపై మాట్లాడారు. తాను ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కన్నియాకుమారి పర్యాటక ప్రాంతానికి వేలాది మంది పర్యాటకులు వచ్చి వెళుతున్నారని, ఈ జిల్లాకు చెందిన ప్రజలు పొరుగు రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, విద్యార్థులు కూడా పలు ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారని, అందువల్ల కన్నియాకుమారి నుంచి కాట్పాడి మీదుగా చెన్నైకి రోజువారీ రైలు నడిపాలని కోరారు. దీర్ఘకాల కోరికగా మిగిలిన నాగపట్టణం జిల్లాలో ప్రసిద్ధిచెందిన వేలాంకన్నికి నడిపే రైళ్ల సంఖ్య కూడా పెంచాలని ఆయన కోరారు.

కారు షెడ్‌లో అగ్నిప్రమాదం



షెడ్‌లో చెలరేగిన మంటలు

ప్యారీస్, జూలై 3: స్థానిక మధురవాయల్‌లోని ప్రైవేటు కార్ల షెడ్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో మూడు కార్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఆ కారు షెడ్ సమీపంలో ఉన్న నాలుగు దుకాణాలు కూడా మంటలు వ్యాపించాయి. మధురవాయల్ ఎంఎండీఏ కాలనీ సమీపంలో వరుస దుకాణాలున్నాయి. హోటల్, చెన్నై మెట్రోవాటర్ బోర్డు పైపుల విక్రయ దుకాణం, కారు విడిభాగాల విక్రయ దుకాణం, టైర్ల దుకాణంతో పాటు కారు మెకానిక్ వర్క్ షాప్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం కారు షెడ్ నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొనేలోపు మంటలు సమీపంలోని దుకాణాలకు వ్యాపించాయి. గంట శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ఘటనపై మూడు కార్లు ధ్వంసం కాగా, స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూలై 3: అమావాస్య, వారాంతపు సెలవుల సందర్భంగా ఈ నెల 5 నుంచి 7వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపునున్నట్లు రాష్ట్ర రోడ్డు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. కిలంబాక్కం బస్ టెర్మిన్ నుంచి తిరువణ్ణామలై, మదురై, సేలం తదితర ప్రాంతాలకు 5వ తేది 415 బస్సులు, 6వ తేది 310 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి నాగపట్టణం, వేలాంకన్ని, బెంగళూరు తదితర ప్రాంతాలకు 5,6 తేదీల్లో తలా 55 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇక, బెంగళూరు, తిరుప్పూర్, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల నుంచి ప్రధాన నగరాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలియజేసింది.

దీపావళి నుంచి టాస్మాక్ దుకాణాల్లో 'కటింగ్' పరిచయం

పెరంబూర్, జూలై 3: దీపావళి నుంచి మద్యం దుకాణాల్లో 90 మి.లీ (కటింగ్) మద్యం బాటిళ్ల విక్రయాలు చేపట్టాలని టాస్మాక్ నిర్ణయించినట్లు సమాచారం. అందుకు సంబంధించిన రాష్ట్రప్రభుత్వం నుంచి టాస్మాక్ సంస్థ అనుమతులు పొందినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఇప్పటికే టెట్రా ప్యాకెట్‌లో 90 మి.లీ మద్యం విక్రయాలు చేపట్టాలనే టాస్మాక్ సంస్థ తీరుపై ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో, ప్యాకెట్‌కు బదులుగా బాటిళ్లలో 90 మి.లీ విక్రయించాలని, ఈ విక్రయాలు దీపావళి నుంచి చేపట్టాలని టాస్మాక్ నిర్ణయించింది. టాస్మాక్ దుకాణాల్లో తక్కువ మద్యం రకం క్వార్టర్ రూ.140కి విక్రయమవుతుండగా, 90 మి.లీ మద్యం బాటిల్ రూ.80కి విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఫైనాన్స్ కంపెనీ యజమాని దారుణ హత్య

● తిరుపూరులో దారుణం

అడయార్, జూలై 3: బాలికతో సన్నిహితంగా ఉన్న ఫొటోను బహిర్గతం చేయకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేసిన ఫైనాన్స్ కంపెనీ యజమాని హత్యకు గురయ్యారు. తిరుపూరులో మంగళవారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది.ఈకేసుతో సంబంధంఉన్న ఎనిమిదిమంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. దిండిగల్ జిల్లాకు చెందిన భువనేశ్వరన్ అనే వ్యక్తి (25) తిరుపూరులోని కనకంపాళెయంలో ఒక ఫైనాన్స్ కంపెనీ నడుపుతున్నాడు. ఆయన ఓ బాలికతో సన్నిహితంగా ఉంటూ, ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. తన స్నేహితుడు తమిళసరన్‌తో మద్యం సేవిస్తూ ఆ బాలిక విషయాన్ని చెప్పడమే కాకుండా, తన వద్ద ఉన్న ఫొటోలు, వీడియోను అతడికి షేర్ చేశాడు. మరుసటి రోజు తమిళరసన్ ఈ వీడియో, ఫొటోలను బాలిక తండ్రి సుందర్‌రాజన్‌కు పంపించి విషయం చెప్పాడు. పైగా తాను మీ కుమార్తెను ప్రేమిస్తున్నట్టు చెప్పాడు. దీంతో సుందర్‌రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నారు. అప్పటికే సుందర్‌రాజన్ తీవ్ర మనస్తాపం చెంది తమిళరసన్ ద్వారా భువనేశ్వరన్‌ను పిలిపించి, అంతం చేయాలని ప్లాన్ చేశాడు.ఈ క్రమంలో తన పథకంలో భాగంగా, తమిళరసన్, భువనేశ్వరన్, తమిళరసన్, అతని స్నేహితులంతా కలిసి మద్యం సేవించారు. ఆ తర్వాత మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో సుందర్‌రాజన్, అతని స్నేహితులు భువనేశ్వరన్‌పై దాడి చేయడంతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈ హత్యకు ప్రధాన కారకుడైన సుందర్‌రాజన్‌ను అరెస్టు చేశారు. మరో ఎనిమిది మంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 3: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

షోలింగనల్లూర్: పళ్లికరనై 200 అడుగుల రేడియల్ రోడ్డు, రామ్‌నగర్ సౌత్ ఎక్స్‌టెన్షన్, బాలాజీ దంత వైద్యకళాశాల, జెరూసలేమ్ కాలేజ్, గణేశ్ అవెన్యూ, రాజేష్ నగర్, వీఎం రోడ్డు, చిత్తాలపాక్కం, పిల్లయార్ ఆలయ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, కామరాజ్ వీధి, సూర్య నగర్, జయ నగర్, సత్య సాయి నగర్, మందవెల్లి వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, పెరుంబాక్కం, గాంధీ నగర్ సొసైటీ.

తాంబరం: మెప్స్, ఇందూర్ మెకావిన్, స్టెరిలైట్ పవర్ ట్రాన్స్‌మెషిన్, కడప్పేరి, ఎమ్మార్జీ, సుబ్బురాయన్ నగర్, చిట్లపాక్కం, తిరునీర్‌మలై, క్రోంపేట.

పల్లావరం: నాగల్‌కేని, కడప్పేరి, మణినాయకర్ వీధి, జయరామన్ నగర్, దుర్గయమ్మన్ ఆలయ వీధి, నీర్‌వన్నన్ వీధి, ట్యాంక్ బండ్ వీధి, లక్ష్మీపురం, కబీరాజ్ అపార్ట్‌మెంట్, గంగా వీధి, భారతీదాసన్ వీధి, సుబ్బురాయన్ నగర్, టెంపుల్ టౌన్ రోడ్డు, భాష్యం నవరత్న ప్లాట్స్, జైన్ ప్లాట్స్, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, గంగా నగర్ 1 నుంచి 6 వీధులు, కాశి గార్డెన్, ఎన్ఎస్కే వీధి, ప్రశాంతి నగర్, భారతీయార్ వీధి, మహాలక్ష్మి స్కూల్ ఏరియా, పార్వతిపురం 1,2 వీధులు.

అంబత్తూర్: పులియంబేడు, జడ్జి కాలనీ, రాజాస్ గార్డెన్, పులియంబేడు మెయిన్ రోడ్డు, నూంబల్, దేవి నగర్, బాలాజీ నగర్, భాగ్యలక్ష్మి నగర్, పెరియ వీధి, సూసై నగర్, అశోక్ నందవనం, తిరువేర్కాడు, కో-ఆపరేటివ్ నగర్, గజేంద్రన్ వీధి, మాదిరవేడు, కావేరి నగర్.

గిండి: మహాలక్ష్మి నగర్, లక్ష్మీ నగర్, వీరాస్వామి వీధి, ఆలయమ్మన్ ఆలయ వీధి, రాజ్యలక్ష్మి నగర్, కాంచి కామాక్షి నగర్, కర్పగాంబాల్ నగర్.

తిరువాన్మియూర్: తిరువళ్లువర్ నగర్, వాసుదేవన్ నగర్ ఎక్స్‌టెన్షన్, వాసుదేవన్ గార్డెన్, రాజాజీ నగర్, అప్పాస్వామి స్ప్రింగ్, పిల్లయార్ ఆలయ వీధి, నేతాజీ నగర్, ఈసీఆర్ రోడ్డు, పీటీసీ కాలనీ, టీఎన్‌హెచ్‌బీ కాలనీ, సాయి శుభోదయ అపార్ట్‌మెంట్స్.

మధురవాయల్: గణపతి నగర్ 1 నుంచి 7 వీధులు, అయ్యప్ప వీధి, మెట్రో నగర్, రత్నా నగర్, భారతిదాసన్ నగర్, తిరుమూర్తినగర్, శ్రీ లక్ష్మీ నగర్ 1 నుంచి 10 వీధులు, వల్లియమ్మాళ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, రాజీవ్ స్కూల్.

టి.నగర్: మోడల్ అడ్మండ్ రోడ్డు 1 నుంచి 6 క్రాస్ వీధులు, సీఐటీ నగర్ ఈస్ట్ 2 నుంచి 6 వీధులు, సౌత్ వెస్ట్ బోగ్ రోడ్డు, సాతుల్ల వీధి, అబ్దుల్ అజీస్ వీధి, మూసా వీధి, సౌత్ దండపాణి వీధి, వీఎన్ రోడ్డు, ముప్పారప్పన్ వీధి, ట్యాంక్ బండ్ రోడ్డు, శ్రీనివాసన్ వీధి, గోపాల్ వీధి, శివాజీ వీధి, దామోదరన్ వీధి, మన్నార్ వీధి, సౌత్ ఉస్మాన్ రోడ్డు, రామనాధన్ వీధి, రామేశ్వరం రోడ్డు, రంగనాధన్ వీధి, మంగేష్ రోడ్డు, బర్కిత్ రోడ్డు, దండపాణి వీధి, క్రిసెంట్ పార్క్ వీధి, జగన్నాధన్ వీధి, మైలై రంగనాధన్ వీధి, తనికాచలం రోడ్డు, లోటస్ కాలనీ, నందనం ఎక్స్‌టెన్షన్ 1 నుంచి 15 వీధులు, ఓల్డ్ టవర్ బ్లాక్, సేమియర్స్ రోడ్డు, టెంపుల్ టవర్, కివిరాజ్ అపార్ట్‌మెంట్స్, వీఆర్ పెరియార్ బిల్డింగ్, అన్నాసాలై.

బంగారం స్మగ్లింగ్ కేసులో 9 మంది అరెస్ట్

● బీజేపీ నేత ఇంట్లో సోదాలు

ప్యారీస్, జూలై 3: స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయంలో జరిగిన 270 కిలోల బంగారం స్మగ్లింగ్ కేసులో యూట్యూబర్ సహా 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, బీజేపీ నాయకుడు పృథ్వీ ఇంట్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. విమానాశ్రయం ప్రాంగణంలోని 'ఎయిర్ హబ్' గిఫ్ట్ షాపు కేంద్రంగా బంగారం స్మగ్లింగ్ జరుగుతుందనే సమాచారంతో అప్రమత్తమైన కస్టమ్స్ అధికారులు నిఘా ముమ్మరం చేశారు. ఆ మేరకు కస్టమ్స్ అధికారులు జరిపిన విచారణలో 270 కిలోల బంగారం అక్రమంగా తరలించిన స్మగ్లర్లకు కొంతమంది సీనియర్ విమానాశ్రయ అధికారులు సహకరించినట్లు వెల్లడైంది. విమానాశ్రయంలో చెన్నై నగరానికి చెందిన సబీర్‌అలి అనే యూట్యూబర్ నడుపుతున్న ఎయిర్ హబ్ గిఫ్ట్ దుకాణంలో చేపట్టిన తనిఖీల్లో స్మగ్లింగ్‌కు సంబంధించి కీలక ఆధారాలను కూడా కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, సబీర్‌అలికి విమానాశ్రయ డైరెక్టర్ సెల్వవినాయగం సహకరించినట్లు ఆరోపణలు రావటంతో కాంచీపురం జిల్లాలో ఉన్న ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. అదే విధంగా, చెన్నైలో ఉన్న మరో ఇద్దరు ఉన్నతాధికారుల నివాసాలు, కార్యాలయాల్లో కూడా తనిఖీలు చేపట్టినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, స్మగ్లింగ్‌కు ప్రధాన కారకుడైన సబీర్‌అలీ సహా ఆయన దుకాణంలో పనిచేసిన సిబ్బందిని అరెస్ట్ చేశారు. వీరితో చేతులు కలిపిన నగరానికి చెందిన బీజేపీ నేత పృథ్వీ ఇంట్లో కస్టమ్స్ అధికారులు బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. రూ.167 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో మరి కొంతమంది విమానాశ్రయ అధికారులు, రాజకీయ ప్రముఖులకు సంబంధాలున్నాయని విచారణలో తెలిసింది.

నేలబొగ్గు అవినీతి... విచారణ ప్రారంభించిన ఏసీబీ

పెరంబూర్, జూలై 3: అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తమిళనాడు విద్యుత్ బోర్డుకు అదానీ సంస్థ దిగుమతి చేసిన నేలబొగ్గులో అవినీతి జరిగిందనే ఆరోపణలపై రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ విచారణ ప్రారంభించింది. ఈ ఆరోపణలను కొద్దిరోజుల క్రితం 'ఫైనాన్సియల్ టైమ్స్' అనే పత్రిక కథనం ప్రచురించింది. ఇండోనేషియా నుంచి 2014లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన నాసిరకం నేలబొగ్గును, ఉన్నత శ్రేణి రకంగా పేర్కొని తమిళనాడు విద్యుత్ బోర్డుకు అదానీ సంస్థ మూడు రెట్లు అధిక ధరకు విక్రయించిందని, ఈ విక్రయాల ద్వారా అదానీ సంస్థ రూ.3,000 కోట్ల లాభాలు ఆర్జించిందని ఆ కథనంలో తెలిపారు. అంతకు ముందుగా, అన్నాడీఎంకే హయాంలో జరిగిన నేలబొగ్గు అవినీతిపై 2018లో 'అర్పోర్ ఇయక్కం' అవినీతి నిరోధక శాఖ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో, అర్పోర్ ఇయక్కం అందజేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టేందుకు అవినీతి నిరోధక శాఖకు రాష్ట్రప్రభుత్వం అనుమతులు జారీచేసిన నేపథ్యంలో, ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, జూలై 3: కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి సమీపంలో విద్యార్థులకు మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పొల్లాచ్చి వెంకటేశ కాలనీ, పాలక్కాడు రోడ్డులోని ప్రైవేటు కళాశాలల సమీపంలో మత్తు ఇంజక్షన్ల విక్రయాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో, మంగళవారం ఆయా కళాశాలల వద్ద పోలీసులు గస్తీ చేపట్టారు. ఆ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా అతని పేరు భాస్కరన్ అని తెలిసింది. అతడి బ్యాగు పరిశీలించగా, 355 మత్తు ఇంజక్షన్ బాటిల్స్ 15 సిరంజిలు స్వాధీనం చేసుకున్న పోలీసులు, భాస్కరన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

అన్నా వర్సిటీకి బాంబు బెదిరింపు

పెరంబూర్, జూలై 3: స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు కలకలం రేపింది. దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, విద్యా సంస్థలు తదితరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు బాంబు బెదిరింపులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గిండిలోని అన్నా విశ్వవిద్యాలయంలో బాంబులుంచినట్లు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు మెసేజ్ వచ్చింది. దీంతో, పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో చేరుకొని వర్సిటీ భవనాలు, ప్రాంగణాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎలాంటి బాంబులు లభ్యం కావడంతో, అది ఫేక్ బెదిరింపుగా నిర్ధారించారు. మెసేజ్ పంపిన వారి కోసం పోలీసులు విచారణ చేపట్టారు.

నిబంధనలు అతిక్రమించి స్టిక్కర్లు... రూ.2.57 కోట్ల జరిమానా

పెరంబూర్, జూలై 3: నగరంలోని ప్రైవేటు వాహనాల నెంబర్ ప్లేట్లపై పోలీసు, లాయర్, ప్రెస్ తదితర స్టిక్కర్ల ఏర్పాటుపై పోలీసు శాఖ నిషేధం విధించింది. అలాగే, ఈ నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకులకు పోలీసుల జరిమానా విధిస్తున్నారు. ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని కోరుతూ దేవదాస్ గాంధీ విల్సన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా, నిబంధనలు అతిక్రమించి నెంబరు ప్లేట్లపై స్టిక్కర్లు ఏర్పాటుచేసినందుకు 51,414 కేసులు నమోదుచేసి, రూ.2.57 కోట్లు, గత మే నెలలో 'సన్ కంట్రోల్ ఫిల్మ్' ఏర్పాటుచేసినందుకు 6,279 కేసులు నమోదుచేసి రూ.31.40 లక్షలు జరిమానా వసూలుచేసినట్లు రాష్ట్రప్రభుత్వం అఫిడవిట్ దాఖలుచేసింది.

జంట హత్య కేసులో ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై3:ఇటీవల తాంబరం సమీపంలో జరిగిన జంట హత్యల కేసులో మరో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మాదకద్రవ్యాల విక్రయాల్లో ఏర్పడిన ఆధిపత్య పోరు కారణంగా గోలపాకృష్ణన్ అనే వ్యాపారి తన ప్రత్యర్థులైన అన్నామలై, తమిళరసన్‌లను తన స్నేహితులతో కలిసి హత్య చేశాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఈవిచారణలో గోపాలకృష్ణన్‌ను ముందుగా అరెస్టుచేసిన పోలీసులు.. పరారీలో ఉన్న తమిళసరన్, అన్నామలైలతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలావుంటే, సేలయూరు నేర విభాగం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాండ్యన్‌ను తాంబరం పోలీస్ కమిషనర్ బదిలీ చేశారు.

వారంరోజుల్లో వివాహం... అంతలోనే యువతి ఆత్మహత్య

అడయార్, జూలై 3: వేలూరు జిల్లా గుడియాత్తంలో మరో వారం రోజుల్లో పెళ్ళిపీటలపై కూర్చోవాల్సిన ఒక యువతి ఆత్మహత్య చేసుకుంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, గుడియాత్తం సమీపంలోని పాక్కం గ్రామానికి చెందిన అన్బు కుమార్తె ఇందుప్రియ (29)కు అదేప్రాంతానికి చెందిన మేఘనాథన్‌తో ఈనెల 10వతేదీ వివాహం చేయాలని పెద్దలు నిర్ణయించారు. రెండు కుటుంబాలు పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం ఆ యువతి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆ యువతిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు వెల్లడించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నేడు మాజీమంత్రి మధ్యంతర బెయిలుపై తీర్పు

పెరంబూర్, జూలై 3: అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్ ముందస్తు బెయిలుపై గురువారం తీర్పు వెలువరిచనున్నట్లు కరూర్ ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి షణ్ముగసుందరం ఉత్తర్వులు జారీచేశారు. ఇదివరకే ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో, మళ్లీ మధ్యంతర బెయిలు కోరుతూ విజయభాస్కర్ పిటిషన్ వేశారు. కరూర్‌లో రూ.100 కోట్ల విలువైన 22 ఎకరాల స్థలాన్ని మాజీ మంత్రి విజయభాస్కర్ ఆక్రమించినట్లు ప్రకాష్ అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విజయభాస్కర్, ఆయన సోదరుడు సహా 13 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

● బీజేపీ నాయకుడి అరెస్ట్

ప్యారీస్, జూలై 3: మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యవహారంలో ఉత్తర చెన్నై బీజేపీ కార్యదర్శి సెంథిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొరుక్కుపేట నేతాజీ నగర్‌కు చెందిన రామరాజన్ భార్య నవమణి కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు రైల్వేస్టేషన్‌లో దుకాణం ఏర్పాటుచేయిస్తానని నమ్మించి సెంథిల్, ఆమె నుంచి రూ.2.50 లక్షలు తీసుకున్నట్లు తెలిసింది. కానీ, దుకాణం ఏర్పాటుచేయకపోగా, డబ్బు కూడా తిరిగివ్వలేదు. ఈ విషయమై నవమణి కొంతకాలం క్రితం సెంథిల్ ను ప్రశ్నించగా ఆయన బెదిరించినట్లు తెలిసింది. దీంతో మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగి నవమణి ఆత్మహత్యాయత్నం చేసింది. చుట్టుపక్కల వారు ఆమెను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ వ్యవహారంపై నవమణి భర్త రామరాజన్ తండయార్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ ఫిర్యాదును విచారించిన పోలీసులు బుధవారం సెంథిల్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

'ఇండియన్-2'తో పోటీ పడుతున్న 'టీన్జ్'

దర్శకనటుడు ఆర్.పార్తిబన్ దర్శకత్వం వహించి సొంతంగా నిర్మించిన 'టీన్జ్' చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే, అదే రోజున విశ్వనటుడు కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. దీంతో కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఈ రెండు చిత్రాలు పోటీ పడనున్నాయి. 2022లో పార్తిబన్ నటించి దర్శకత్వం వహించిన నాన్‌లీనియర్ సింగిల్ షాట్ మూవీ 'ఇరవిన్ నిళల్' విడుదలై విజయం సాధించింది. ఈ సినిమాలో పాటల్లో నేపథ్యగాయని శ్రేయా ఘోషల్ ఆలపించిన 'మాయావి' పాటకు జాతీయ అవార్డు సైతం దక్కింది. ఇపుడు మరో వైవిధ్యభరితమైన కథతో అందరూ చిన్నపిల్లలే నటించిన 'టీన్జ్' మూవీ తెరకెక్కించారు. చైల్డ్ సెంట్రిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి డి.ఇమాన్ సంగీతం అందించారు. కావ్‌మిక్ ఆరి సినిమాటోగ్రఫీ అందించగా, బయోస్కోప్ డ్రీమ్స్, ఆకీరా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా తెరకెక్కించాయి. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఈ సినిమాను ఈ నెల 12వ తేదీన విడుదల చేయనున్నట్లు ఆర్.పార్తిబన్ ప్రకటించినప్పటికీ ప్రమోషన్ కార్యక్రమాలు మాత్రం ఇంకా ప్రారంభించలేదు. దీంతో కేవలం పబ్లిసిటీ కోసమే 'ఇండియన్-2' విడుదలయ్యే తేదీలో రిలీజ్ చేయనునట్టు ప్రకటించారా? అనే చర్చ కోలీవుడ్‌లో సాగుతుంది.



'టీన్జ్'లో పార్తిబన్

చిత్రజ్యోతి

రూ.వంద కోట్ల క్లబ్‌లో 'మహారాజ'



'మహారాజ'లో విజయ్ సేతుపతి

నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయం సాధించి బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. దీంతో ఈ సినిమా కలెక్షన్లపరంగా రూ.100 కోట్లను క్రాస్ చేసిందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం. ఫ్యాషన్ స్టూడియో పతాకంపై ప్రముఖ నిర్మాత సుధన్ నిర్మించారు. బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపులను ప్రధానాంశంగా తీసుకుని ఈ సినిమా స్క్రీన్‌ప్లే సాగుతుంది. గత నెల 14వ తేదీన విడుదలైన ఈ చిత్రాన్ని కేవలం రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించగా, 18 రోజుల్లో ఇప్పటివరకు రూ.100 కోట్లకుపైగా వసూళ్ళను రాబట్టింది. అలాగే, ఈ సినిమా కంటే ముందు వచ్చిన 'అరణ్మనై-4' కూడా రూ.100 కోట్ల కలెక్షన్ చేసిన విషయం తెల్సిందే.

26న 'డెడ్‌పూల్ అండ్ వోల్వారిన్' రిలీజ్

హాలీవుడ్ నిర్మాణ సంస్థ మార్వెల్ సినిమాటిక్ వరల్డ్ నుంచి మరో సూపర్ హీరో చిత్రం రానుంది. దీనికి 'డెడ్‌పూల్ అండ్ వోల్వారిన్' అనే టైటిల్ ఖరారు చేశారు. గతంలో వచ్చిన 'డెడ్‌పూల్' సిరీస్ నుంచి రాబోతున్న ఈ సినిమాను ఈ నెల 26వ తేదీ విడుదల చేయనున్నారు. ఈ హాలీవుడ్ మూవీలో ర్యాన్ రేనాల్డ్స్, హ్యూగ్ జాక్‌మాన్ ప్రధాన పాత్రల్లో నటించగా, ఇతర పాత్రల్లో ఎమ్మా కొరిన్, మోరెనా బక్కరిన్‌లు ముఖ్య పాత్రలను పోషించారు. తమిళం, తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ చేస్తున్నట్టు ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థలు మార్వెల్ స్టూడియోస్, 21 ల్యాప్స్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించాయి. డెడ్‌పూల్‌గా ర్యాన్ రేనాల్డ్స్ భారీ యాక్షన్ స్టంట్స్‌తో ప్రేక్షకులను అలరిస్తారని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి.



'డెడ్‌పూల్ అండ్ వోల్వారిన్'లో ఓ దృశ్యం

ఇనియాకు హీరోయిన్‌గా అవకాశాలు!



సినిమాల్లో చిన్న చిన్న పాత్రలను పోషించిన నటి ఇనియాకు ఇపుడు హీరోయిన్‌గా అవకాశాలు వస్తున్నాయి. ఆమె హీరోయిన్‌గా నటించిన 'సీరన్' చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమైంది. జేమ్స్ కార్తీక్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చి, సొంతంగా నిర్మించారు. దురై కె.మురుగన్ దర్శకత్వం వహించారు. సోనియా అగర్వాల్ కీలక పాత్ర పోషించారు. సమాజంలోని హెచ్చుతగ్గులు, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులను ప్రధానంగా ప్రస్తావిస్తూ సాగే ఒక మంచి కమర్షియల్ చిత్రంగా రూపొందించారు. అలాగే మరో రెండు మూడు చిత్రాల్లో ఆమె హీరోయిన్‌గా నటించేందుకు సంప్రదింపులు జరుపుతున్నాయి. కాగా, 'వాగైసూడవ' చిత్రం ద్వారా వెలుగులోకి వచ్చిన ఇనియా... ఆ తర్వాత 'మౌనగురు', 'అమ్మావిన్ కైపేసి', 'కణ్ పేసుం వార్తైగల్', 'మాసాని', 'నాన్ సిగప్పు మణిదన్', 'నాన్ కడవుల్ ఇల్లై' 'బొట్టు' వంటి చిత్రాల్లో నటించారు. గత కొంతకాలంగా హీరోయిన్‌గా సరైన అవకాశాలు లేవు. గత మూడేళ్ళకాలంలో ఆమె కేవలం ఒకే ఒక చిత్రంలో నటించారు. కానీ, ఇపుడు ఆమెకు వరుస సినీ అవకాశాలు వస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్‌కు మాతృవియోగం

సీఎం స్టాలిన్ సంతాపం



కల్పగం రామన్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి ఉదయనిధి, ఎంపీ దయానిధి మారన్

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ మాతృమూర్తి కల్పకం రామన్ బుధవారం ఉదయం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలకు తోడు గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స ఫలించక మృతి చెందారు. ఈ విషయం తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమె మృతిపట్ల సంతాపం ప్రకటించారు. పీఎస్ రామన్ నివాసగృహానికి వెళ్ళి ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి ఉదయనిధి, ఎంపీ దయానిధి మారన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ఎస్. మురుగానందం తదితరులు కూడా కల్పకం రామన్ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఎస్ రామన్, కుటుంబ సభ్యులను కూడా ఓదార్చారు.

మహాలక్ష్మి అమ్మవారికి బంగారు నాణేలతో కూడిన దుస్తులు



బంగారు నాణేలతో కూడిన దుస్తులు అమ్మవారికి సమర్పిస్తున్న శక్తి అమ్మ

వేలూరు, జూలై 3: స్థానిక శ్రీపురం స్వర్ణాలయంలో ప్రపంచ శాంతి కోరుతూ స్వర్ణలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అమ్మవారికి 6 కిలోల బరువున్న వెయ్యి బంగారు నాణేలతో తయారుచేసిన వస్త్రాలను శక్తి అమ్మ బుధవారం సమర్పించారు. కార్యక్రమంలో నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ బాలాజి, శ్రీపురం డైరెక్టర్ సురేష్‌బాబు, నారాయణి పీఠం మేనేజర్ సంపత్ సహా రాష్ట్రం, విదేశాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులను శక్తి అమ్మ ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిరోధక అవగాహన ప్రచారం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం సందర్భంగా నగరంలోని అంబత్తూరు, తిరువొత్తియూరు, పోరూరు మార్కెట్ ప్రాంతాల్లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ప్లాస్టిక్ నిరోధక అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల కలిగే నష్టాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అంబత్తూరులో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ అధ్యక్షురా లు డాక్టర్ కే శాంతకుమారి పాల్గొని వెయ్యికి పైగా గుడ్డ సంచులను ప్రజలకు ఉచితంగా అందజేశారు.



అంబత్తూరు వద్ద పసుపు గుడ్డసంచులను పంపిణీ చేస్తున్న స్టాండింగ్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ కే శాంతకుమారి

రూ.1000 కోట్లతో కేప్ జెమినీ ప్రాంగణం

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో పురోగమిస్తున్న రాష్ట్రంలో సమాచార సాంకేతిక సంస్థలకు కొదువలేదు. స్టార్టప్‌ల నుండి ఐటీ సేవల వరకూ రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఎగుమతులలోనూ, ఐటీ సంబంధిత ఉద్యోగవకాశాల కల్పనలోనూ రాష్ట్రం ముందంజలో ఉంది. అదే సమయంలో రాజధాని నగరం చెన్నైలోనూ ఐటీ పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ ఐటీ సేవా సంప్రదింపుల సంస్థ కేప్ జెమినీ నగరంలో కొత్త ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటన చేసింది. వచ్చే మూడేళ్లలో రూ.1000 కోట్ల మేర ఆ సంస్థ పెట్టుబడులు పెట్టనుందని పేర్కొంది. ఈ పెట్టుబడులతో కేప్ జెమినీ సంస్థ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. సుమారు ఐదువేల మంది ఉద్యోగులు ఆ క్యాంపస్‌లో పనిచేయనున్నారు. 2027లోగా ఈ కొత్త ఐటీ క్యాంపస్ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. అంతే కాకుండా ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయనున్న ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.3 కోట్లు విరాళంగా అందజేయనున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కొత్త ఐటీ క్యాంపస్‌లో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంజనీరింగ్, డిజిటల్, క్లౌడ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తదితర శాఖలకు చెందిన నిపుణులు సేవలను అందించనున్నారు.

చిదంబరం ఆలయంలో ఆణి ఉత్సవాల ప్రారంభం

● 11న రథోత్సవం



నటరాజస్వామి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న దీక్షితార్లు

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం చిదంబరం నటరాజస్వామివారి ఆలయంలో శివకామసుందరి సమేత నటరాజ మూర్తి ఆణి తిరుమంజన దర్శన వేడుకలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ప్రతియేటా ఆణి మాసంలో తిరుమంజన దర్శనవేడుకలు, మార్గళి మాసంలో ఆరుద్రదర్శన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ యేడాది ఆణి తిరుమంజన దర్శనవేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. శివకామసుందరి సమేతే నటరాజమూర్తి కొలువుదీరిన చిత్‌సభ ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద పంచమూర్తుల సమక్షంలో స్వామివారి ప్రతినిధిగా ఉన్న హస్తరాజర్‌ను కొలువుదీర్చి ఉత్సవ ఆచార్యులు శివ. కృష్ణసామి దీక్షితార్ వృషభ ధ్వజస్తంభంపై ఆరోహణం చేశారు. ఈ ఉత్సవాల్లో స్వామివారు ప్రతిరోజూ వివిధ వాహనసేవలలో పాల్గొని భక్తులను అనుగ్రహించనున్నారు. ఆ మేరకు గురువారం రాత్రి చంద్రప్రభ వాహనంలో, శుక్రవారం ఉదయం స్వర్ణ సూర్యప్రభ వాహనంలో, ఈ నెల 6న రజత భూతవాహనంలో స్వామివారు ఊరేగనున్నారు. ఈ నెల 7న రజత వృషభ వాహనంలో స్వామివారు (తెరుఉడైచ్చాన్), 8న రజత గజవాహనంలో ఊరేగనున్నారు. ఈ నెల 9 స్వర్ణ కైలాసవాహనంలోను, 10న స్వర్ణ రథంలోనూ పిచ్చాండవర్ ఊరేగనున్నారు. ఈ వేడుకలలో ప్రధానఘట్టమైన మహారథోత్సవం ఈ నెల 11న జరుగనుంది. ఈ రథోత్సవంలో మూలవర్లు ఉత్సవ మూర్తిగా రథోరోహణం చేసి భక్తులకు కనువిందు చేయనున్నారు. అదే రోజు రాత్రి ఎనిమిది గంటలకు వేయికాళ్ల మండపం ఎదుట ముఖమండపంలో ఏకకాల లక్షార్చన జరుపనున్నారు. ఈ నెల 12న వేకువజాము నాలుగు నుంచి ఉదయం ఆరు గంటల వరకు శివకామసుందరి సమేత నటరాజ మూర్తికి మహాభిషేకం నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు చిత్‌సభలో రహస్య పూజలు, పంచమూర్తుల ఊరేగింపు జరుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఆణి తిరుమంజన దర్శనం, జ్ఞానాకాశ చిత్‌సభా ప్రవేశ వేడుకలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దీక్షితార్ల కమిటీ కార్యదర్శి వెంకటేశ దీక్షితార్, డిప్యూటీ కార్యదర్శి సుందర తాండవ దీక్షితార్, ఇతర దీక్షితార్లు ఏర్పాట్లు చేపడుతున్నారు. చిదంబరం ఏడీఎస్పీ రఘుపతి, నగర సీఐ రమేష్‌బాబు నాయకత్వంలో సుమారు ఐదు వందల మంది పోలీసులు ఈ వేడుకలకు తగు భద్రత కల్పించనున్నారు.

అపోలో ఓఎమ్మార్ ఆస్పత్రిలో

వృద్ధుడికి అరుదైన హృద్రోగ శస్త్రచికిత్స



చికిత్స చేయించుకున్న వృద్ధుడితో అపోలో ఆస్పత్రి వైద్యనిపుణులు

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మహాబలిపురం రహదారి (ఓఎమ్మార్)లోని అపోలో ఆస్పత్రి వైద్యనిపుణులు 76 యేళ్ల వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అపోలో హాస్పిటల్స్ హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణులు డాక్టర్ ఎంఎం యూసప్ ఈ వివరాలను వెల్లడిస్తూ ప్రాణపాయ స్థితిలో ఓఎమ్మార్ ఆస్పత్రిలో చేరిన వృద్ధుడికి సీటీ స్కాన్ తీయగా స్టెంట్ కుంచించుకుపోయి ధమని గోడకు ముప్పువాటిల్లే స్థితిలో ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. తదుపరి పరీక్షలన్నీ పూర్తయ్యాక ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ కన్నయన్, డాక్టర్ మధు ప్రభుదాస్, డాక్టర్ కళ్యాణరామన్, డాక్టర్ సెందూర్‌నంబి, డాక్టర్ ప్రతిమ సంయుక్తంగా వైద్యపరీక్షలు నిర్వహించిన మీదట స్టెంట్ తొలగింపు ప్రక్రియతో కూడిన శస్త్రచికిత్సను చాలాచాకచక్యంగా నిర్వహించారన్నారు. శస్త్రచికిత్స ముగిసిన ఆరునెలల తర్వాత రోగి సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యాడని తెలిపారు. క్లస్టర్-2 సీఈఓ డాక్టర్ రాహుల్ మేనన్ మాట్లాడుతూ చెడిన స్టంట్ తొలగించే శస్త్రచికిత్సను నిర్వహించి అపోలో ఓఎమ్మార్ ఆసుపత్రి వైద్యనిపుణుల బృందం కొత్త చరిత్రను సృష్టించిందని అభినందించారు.

కావేరి హాస్పిటల్‌లో ఆఫ్రికన్ వృద్ధురాలి మెదడులో కణితి తొలగింపు



వృద్ధురాలికి చేసి శస్త్రచికిత్స గురించి వివరిస్తున్న వైద్యనిపుణులు డాక్టర్ పూర్ణచంద్రన్, డాక్టర్ రంగరాజన్ జ్యోతి

చెన్నై, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని కావేరి హాస్పిటల్‌లో 69 యేళ్ల ఆఫ్రికన్ వృద్ధురాలికి మెదడులోని కణితిని అరుదైన శస్త్రచికిత్స ద్వారా తొలగించి ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు ఆ హాస్పిటల్ మెదడు, వెన్నెముకల శస్త్రచికిత్సా నిపుణుడు డాక్టర్ రంగరాజన్ జ్యోతి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మూడేళ్లకు పైగా తీవ్రమైన తలపోటుతో బాధపడిన ఆ వృద్ధురాలికి వైద్యపరీక్షలు జరిపినప్పుడు మెదడు పైభాగంలో కణితి ఏర్పడినట్లు కనుగొన్నామని, దానిని తొలగించేందుకు కపాలం తెరచి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని, అయితే వృద్ధాప్యంలో ఉన్న ఆమెకు అలాంటి ఆపరేషన్ ప్రాణాంతకమయ్యే అవకాశాలు ఉండటంతో కంటి రెప్ప వద్ద చిన్న రంధ్రం వేసి 'కీహోల్ క్రానియోటమీ' పద్ధతిలో శస్త్రచికిత్స జరిపి కణితిని పూర్తిగా తొలగించామని చెప్పారు. ఆస్పత్రిలో ఆరుకోట్ల విలువచేసే జీపీఎస్, స్కానింగ్ పరికరాలు ఉండటం వల్లే వాటి సహాయం ద్వారా శస్త్రచికిత్స చేయగలిగామని చెప్పారు. ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేయడం వల్ల మెదడుకు ఎలాంటి హాని కలుగలేదని, ఆ వృద్ధురాలు కొద్ది రోజుల్లోనే సంపూర్ణంగా కోలుకుని స్వదేశానికి వెళ్ళారని చెప్పారు. విలేఖరుల సమావేశంలో వడపళని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పూర్ణచంద్రన్ కూడా పాల్గొన్నారు.



చెన్నైలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రముఖ సినీనటుడు శరత్‌కుమార్ కుమార్తె వరలక్ష్మి శరత్‌కుమార్ పెళ్ళి రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రి ఉదయనిధి

రంగు మారిన సముద్రపు నీరు



పసుపు రంగుకు మారిన ఎన్నూర్ ముఖద్వారం

ప్యారీస్, జూలై 3: ఉత్తర చెన్నై పరిధిలోని ఎన్నూర్ ప్రాంతంలోని సముద్రపు నీరు బుధవారం పసుపు రంగుకు మారడంతో జాలర్లు ఆందోళనకు గురయ్యారు. ఎన్నూర్‌లో రాష్ట్రప్రభుత్వ నిర్వహణలో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న సముద్రంలో జాలర్లు చేపలు పడుతుంటారు. సంఘటన రోజు ఉదయాన్నే వేటకు వెళ్లిన జాలర్లు, ఎన్నూర్ ముఖద్వారంలోని సముద్రపు నీరు పసుపు రంగులోకి మారడం గుర్తించి భయాందోళనకు గురై చేపలు పట్టకుండా తీరానికి తిరిగొచ్చారు. దీనిపై స్థానికులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఇసుక రేణువులు అధికంగా ఒకే ప్రాంతంలో చేరే సమయంలో సముద్రపు నీరు రంగు మారడం సహజమేనని అధికారులు వివరణ ఇచ్చారు.

వైభవంగా సుదర్శన హోమం



విజయలక్ష్మి సమేత సుదర్శన హోమం నిర్వహిస్తున్న అజంతా శంకరరావు, ఎంవీ నారాయణ గుప్తా దంపతులు

ప్యారీస్, జూలై 3: స్థానిక బ్రాడ్‌వే ఆచారప్పన్ వీధిలోని అక్షయ సాయి బాబా ఆలయంలో లోకకల్యాణార్థం బుధవారం ఉదయం సుదర్శన హోమం నిర్వహించారు. ద్వాదశి, రోహిణి నక్షత్రయుత శుభలగ్నంలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు 108 కలశాలతో అష్టోత్తర మహాభిషేకాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా గణపతి హోమం, సుదర్శన హోమం, నవగ్రహ, పంచశుద్ధ, రుద్ర, శాంతి హోమాలు నిర్వహించి చివరగా శాంతి అభిషేకం చేశారు. అష్టోత్తర శత కలశ మహాభిషేకం సందర్భంగా శ్వేతవర్ణ సాయినాధుడి విగ్రహాన్ని, ఆలయ ప్రాంగణాన్ని అలంకరించి, మూల మంత్ర హోమంతో అక్షయబాబాను సేవించారు. జై వాసవి సాయి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు,విజయలక్ష్మి, ఫైనాన్సియల్ ట్రస్టీ డా.ఎంవీ నారాయణగుప్త, జ్యోతి దంపతుల పర్యవేక్షణలో ఉదయం 7 గంటలకు పుణ్యాహవచనం, సంకల్పం, కుంభ ఆరాధన, మహా హారతి పూజలు నిర్వహించి, భక్తులందరికి తీర్థ, అన్నప్రసాదాలు పంపిణి చేశారు.



స్వాతంత్ర్య సమరయోధుడు త్యాగి ఇమ్మానువేల్ శేఖరనార్ జయంతి వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ప్రకటించిన నేపథ్యంలో సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని ధన్యవాదాలు తెలుపుతున్న మాజీ ఐఏఎస్ అధికారులు సెల్వరాజ్, వడివేల్, మాజీ శాసనసభ్యుడు మరుగవేల్‌రాజన్, అఖిలభారత దేవేందర్‌కుల వెళ్ళాలర్ సంఘాల ప్రతినిధులు

సెప్టెంబరులో తమిళనాడు ట్రావెల్ టూరిజం బీ2బీ

అడయార్, జూలై 3: తమిళనాడు ట్రావెల్ టూరిజం ఎక్స్‌పో సెప్టెంబరు నెలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 'తమిళనాడు ట్రావెల్ టూరిజం ఎక్స్ బీ2బీ మీట్' పేరుతో సెప్టెంబరు 20 నుంచి 22వ తేదీ వరకు మదురైలోని గ్రాండ్ మదురై హోటల్ వెనుక ఉన్న ఐడీఏ స్కుద్దర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఇందులో తమిళనాడులోని పర్యాటక రంగానికి చెందిన 150 నుంచి 200 స్టేక్‌హోల్డర్లు పాల్గొనే అవకాశం ఉంది. అలాగే, భారత్‌తో పాటు పొరుగు దేశాలైన మలేసియా, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన 250 పొటెన్షియల్ బయ్యర్లు కూడా పాల్గొననున్నారు. వీరిలో టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లు వంటి పర్యాటక రంగానికి చెందిన అనుబంధ విభాగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని సీఐఐకు చెందిన టూరిజం టాస్క్ ఫోర్స్ ఛైర్మన్ విక్రమ్ కోటా బుధవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సౌత్ ఇండియా హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ (ఎస్ఐహెచ్ఆర్ఏ) డైరెక్టర్ (ఆపరేషన్స్) సుందర్ సింగారం, సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ సుభాంగి తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో ఈ ఎక్స్‌పో కన్వీనర్‌గా ఎస్ఐహెచ్ఆర్ఏ గౌరవ కార్యదర్శి టి.నటరాజన్‌ను ఎంపిక చేశారు. ఈ ఎక్స్‌పోను తమిళనాడు ట్రావెల్ ఎక్స్‌పో (టీటీఈ), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఎస్ఐహెచ్ఆర్ఏలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు